ప్రజాశక్తి
శనివారం 4 మార్చి 2023
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఘనంగా పెట్టుబడుల సదస్సు ప్రారంభం


- తొలి రోజు రూ.11.85 లక్షల కోట్లతో 92 ఎంఒయులు
- తరలొచ్చిన అంబానీ, కరన్ అదానీ, జిఎంఆర్, పలువురు పారిశ్రామికవేత్తలు
- సుస్థిర ప్రగతిలో ఎపి ముందంజ : సిఎం జగన్
- త్వరలో విశాఖ నుంచే పాలనని పునరుద్ఘాటన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో రెండు రోజులపాటు తలపెట్టిన 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023' శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ, అదానీ పోర్ట్స్ సిఇఒ కరన్ అదానీ, జిఎంఆర్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు, జిందాల్, అదిత్యా బిర్లా గ్రూప్, అరబిందో గ్రూప్, డైకిన్, ఎన్‌టిపిసి, ఐఒసిఎల్ కంపెనీల ప్రతినిధులు, పలువురు విదేశీ ప్రతినిధులు హాజరయ్యారు. సమ్మిట్‌ను ప్రారంభిస్తూ సిఎం జగన్మోహన్‌రెడ్డి మాట్లాడారు. 'మీ వ్యాపారాలకు, పెట్టుబడులకు నాది హామీ. పరిశ్రమ మీది.. ప్రోత్సాహం మాది. దేశంలోనే సుస్థిర ప్రగతిని సాధించే అగ్రగామి రాష్ట్రంగా ఎపిని తీసుకెళ్లడమే నా లక్ష్యం' అని ఆయన ఉద్ఘాటించారు. త్వరలో విశాఖ నుంచే తమ పాలన సాగుతుందన్నారు.



సమ్మిట్ వేదికపై సిఎం జగన్, పలువురు పారిశ్రామికవేత్తలు



ముకేష్ అంబానీతో కరచాలనం చేస్తున్న జగన్

సమ్మిట్ విశేషాలు

సమ్మిట్ వేదికపై వైఎస్ జగన్, రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ మధ్య ఎడతెరిపి లేని చర్చలు జరిగాయి. సుమారు 20 మంది జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక ప్రతినిధులు ఓ వైపు ప్రసంగాలు చేస్తుండగానే వీరిద్దరి మధ్య వ్యక్తిగతంగా సంభాషణ సాగింది. మరోవైపు ఈ సమ్మిట్ ద్వారా రూ.2 లక్షల మిగతా 2లో..

రాష్ట్ర పారిశ్రామిక రంగ ప్రగతికి చిహ్నంగా నిలిచిన ప్రదర్శన

సమ్మిట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. రాష్ట్రంలో వివిధ పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, మహిళా సంఘాలు, హస్త కళాకారులు ఉత్పత్తి చేసిన, తయారు చేసిన వస్తువులు, కళాకృతుల ప్రదర్శన అన్ని రంగాల్లో ఎపి ప్రగతిని ప్రతిబింబించింది. ఇందులో మొత్తం వివిధ ప్రభుత్వ, పారిశ్రామిక, వాణిజ్య సంస్థలు 137 స్టాళ్లను ఏర్పాటు చేశాయి. సిఎం జగన్ మోహన్ రెడ్డి, కేంద్ర ఉపరితల రవాణా, పోర్టులు శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈ ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం పారిశ్రామిక, వాణిజ్య ప్రదర్శనలో ఏర్పాటు చేసిన అన్ని స్టాళ్లను వారు సందర్శించి ఆయా స్టాళ్లలో ప్రదర్శించిన అంశాలను తెలుసుకున్నారు.

ప్రజాగళం వినిపించే కోరెడ్ల రమాప్రభను గెలిపించండి

వార్త మెయిన్‌లో..

జగన్ ఉత్తరాంధ్ర ద్రోహి : అయ్యన్న

వార్త 2లో..

కృష్ణంరాజు అరెస్టు చట్టవిరుద్ధం

వార్త 2లో..

13 తర్వాత నీటి సరఫరా కార్మికుల సమ్మె



మాట్లాడుతున్న వెంకటరెడ్డి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసిలో నీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని గత సమ్మె సందర్భంగా జరిగిన ఒప్పందంలో అంగీకరించారని, ఆ ఒప్పందాన్ని తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13 తర్వాత ఏ రోజు నుంచైనా నీటి సరఫరా విభాగం కార్మికులంతా సమ్మెకు దిగనున్నారని జివిఎంసి వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు వర్కర్స్ చట్టం, కనీస వేతన చట్టం, వేస్ ఆన్ కోడ్స్ రూల్స్ ప్రకారం, జిఒ 7లో పేర్కొన్న విధంగా సెమీ స్కిల్డ్ కార్మికులుగా ఉన్న వీరందరికీ రూ.18,500 వేతనం చెల్లించాల్సి ఉందన్నారు. ఐటిఐ విద్యార్హత ఉన్న వారికి స్కిల్డ్ వేతనం రూ.21,500 చెల్లించాలన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ చెల్లించాలని, జీతాలు ప్రతి నెలా సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జనవరిలో మొత్తం నీటి సరఫరాను నిలిపివేసి టోకెన్ సమ్మె నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. దీంతో అధికారులు దిగివచ్చి తమ యూనియన్‌తో చర్చలు జరిపి ఫిబ్రవరి 28వ తేదీలోగా సమస్యలు పరిష్కరిస్తామని లిఖితపూర్వక హామీ ఇచ్చారన్నారు. అయితే ఆ హామీ నేటికీ పరిష్కారం కాలేదన్నారు. అందుకే ఒప్పందం మేరకు హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మిగతా 2లో..

ప్రజా సంపద లూటీ ఆపాలి

వార్త 4లో..

వంటగ్యాస్ ధరలను తగ్గించాలి

వార్త 4లో..

కమనీయం.. అనంతుని కల్యాణం

వార్త 4లో..



పోలీస్ స్టేషన్‌లో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు

ఉక్కు నేతలపై నిర్బంధం

32 మంది అరెస్టు

వార్త మెయిన్‌లో..

పెద్ద పరిశ్రమలను పోగొట్టిన..
జగన్ ఉత్తరాంధ్ర ద్రోహి : అయ్యన్న



మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : గత ప్రభుత్వ కాలంలో ఎపికి వచ్చిన పెద్ద పెద్ద పరిశ్రమలను అమలులోకి రాకుండా అడ్డుకొని, వాటిని వెళ్ళగొట్టిన చరిత్ర హీనుడు, ఉత్తరాంధ్ర ద్రోహి జగన్మోహన్ రెడ్డి అని టిడిపి మాజీ మంత్రి సిహెచ్.అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రాకు లూలూ కంపెనీ గుడ్ బై చెప్పిందన్నారు. విశాఖలో ఏర్పాటు కావలసిన లూలూ వస్తే 7 వేల మందికి ఉద్యోగాలు వచ్చేవని తెలిపారు. విశాఖ మెట్రో ప్రాజెక్టును పోగొట్టారని, అందుకే జగన్‌ని ఉత్తరాంధ్ర ద్రోహి అంటానని, దీన్ని ఎవరైనా కాదంటారా ? అని ప్రశ్నించారు. అదానీకి ఇచ్చిన భూమిలో 30 ఎకరాలను కొట్టేసి ఫ్లాట్‌లు వేసి అమ్మేసుకుంటున్నారని ఆరోపించారు. మిలినియం టవర్స్‌ని నిర్వీర్యం చేసేసారన్నారు. కర్నూలులో రూ.670 కోట్లతో గత ప్రభుత్వం మెగా సీడ్ పార్క్ మంజూరు చేసిందన్నారు. ఈ చర్యను వైసిపి మంత్రి కీర్తిశేషులు గౌతమ్ రెడ్డి కూడా మెచ్చుకున్నారని, జగన్ మాత్రం ఆపేయమని ఆర్డర్ వేశారని ఆరోపించారు. పోయిన ఇండస్ట్రీస్ ఎందుకు పోయాయో జగన్ చెప్పాలన్నారు. విజన్ ఉన్న చంద్రబాబుకూ, జగన్‌కూ పోలిక ఎక్కడిదని అన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పరిశ్రమలు పెట్టాలనే ఆలోచన చంద్రబాబుది అయితే, పెట్టిన పరిశ్రమలను పంపే ఆలోచన జగన్‌ది అని తెలిపారు. జగన్ తుగ్లక్ పరిపాలన వల్ల రాష్ట్రం అథోగతి పాలయ్యిందని ఆరోపించారు. సమ్మిట్‌లో పారిశ్రామికవేత్తలు కంటే తెల్ల చొక్కాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. సమావేశంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణంరాజు అరెస్టు చట్టవిరుద్ధం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 3, 4 తేదీల్లో విశాఖలో పారిశ్రామికవేత్తల సమ్మిట్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి వస్తున్నారనే కారణంతో ప్రజా సంఘాల ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను బలపరుస్తున్న పంచ గ్రామాల ప్రజా, రైతు సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి టివి.కృష్ణంరాజును గురువారం నుంచే పోలీసులు గృహ నిర్బంధం చేయడం చట్ట విరుద్ధమని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ అన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారికి శుక్రవారం ఆయన ఫిర్యాదు చేశారు. కృష్ణంరాజును ప్రచారానికి బయటకు వెళ్లనీయలేదన్నారు. కోరెడ్ల రమాప్రభ విజయ అవకాశాలను దెబ్బతీయడానికే ఈ చర్యకు ప్రభుత్వం పాల్పడిందని తెలిపారు. తక్షణం ఇటువంటి చర్యలు విడనాడాలని అన్నారు.

'ఉక్కు' ఉద్యమంపై
కేంద్రం స్పందించకపోవడం దారుణం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రెండు సంవత్సరాలుగా ఉద్యమం సాగుతున్నా కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టుగా కూడా లేకపోవడం దారుణమని స్టీల్‌ప్లాంట్ వైఎస్ఆర్‌టియుసి అధ్యక్షుడు వై.మస్తానప్ప అన్నారు. స్టీల్‌ప్లాంట్ ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ప్రజా, కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలేదీక్షలు శుక్రవారం నాటికి 699వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో వైఎస్ఆర్‌టియుసి నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారానికి దీక్షలు 700 రోజులకు చేరుకుంటున్న సందర్భంగా గాంధీ విగ్రహం దీక్షా శిబిరం వద్ద అన్ని కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కళ్ళకు గంతలు కట్టుకొని పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్మిక, ప్రజా సంఘాలతో పాటు ప్రజలు కూడా అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. దీక్షల్లో శకనాల చంద్రశేఖర్, పప్పు మూలయ్య, శ్రీనివాస నాయుడు, రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.సూరప్పుడు తదితరులు పాల్గొన్నారు.

5న కళాకారులకు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : లయన్స్ క్లబ్ స్మార్ట్ సిటీ, విశాఖ సంగీత కళాకారుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 5న కళాకారుల కోసం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఆయా సంస్థల అధ్యక్షులు ఎం.త్రినాధరావు, మహ్మద్ ఖాన్ ఓ ప్రకటనలో తెలిపారు. 5న ఉదయం 8.30 నిమిషాలకు డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సంగీతం, సాహిత్యం, గానం, నృత్యం, నాటకం ఇతర అంశాలకు సంబంధించిన కళాకారుల కోసం ఈ ఉచిత వైద్య శిబిరం జరుగనుందన్నారు. ఇఎన్‌టి, దంత, కంటి పరీక్షలతో పాటు జనరల్ ఫిజిషియన్స్ హాజరవుతారన్నారు. అనంతరం క్యాన్సర్ వ్యాధులపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశామన్నారు. మెడికల్ క్యాంపును కళాకారులు, వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9395111133 నెంబర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా పెట్టుబడుల సదస్సు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి..) కోట్ల పెట్టుబడులు సమీకరిస్తున్నట్లు నెల రోజుల నుంచీ వివిధ సందర్భాల్లో ప్రభుత్వ పెద్దలు గుడివాడ అమర్‌నాథ్, వైవి.సుబ్బారెడ్డి చెబుతూ వచ్చినా సమ్మిట్ రోజు శుక్రవారం సిఎం వైఎస్ జగన్ రూ.13 లక్షల కోట్లు ఎంఒయులు అని ప్రకటించగానే సభికులంతా ఒక్కసారిగా అవాక్కయ్యారు. వెంటనే తేరుకుని చప్పట్లు కొట్టారు. ఊహలకందని లెక్కలు ఎలా వచ్చాయి ? ఎక్కడ తయారయ్యాయి ? అంటూ సభికుల్లో చర్చ జరిగింది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో నిర్వాహకులు అందజేసిన కిట్ల కోసం సభా ప్రాంగణంలో గలాటా చోటుచేసుకుంది. ప్రతినిధులకు విధిగా అందజేయాల్సిన కిట్‌లు సకాలంలో వారికి అందలేదు. కిట్ల పంపిణీ వద్దకు కొంతమంది ప్రతినిధులు వచ్చి తమకు అందలేదని వాదనకు దిగారు. నిర్వాహకుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో అక్కడి టెంట్లను పీకేశారు.



సమ్మిట్‌కు హాజరైన విదేశీ ప్రతినిధులు

ప్రత్యేక ఆకర్షణగా ఎపి పెవిలియన్

ఈ ప్రదర్శనలో ఎపి పెవిలియన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇందులో శ్రీసిటీలో వివిధ పరిశ్రమల ద్వారా తయారు చేసిన ఎలక్ట్రానిక్ పరికరాలు, వాహనాలు, ఇతర ఉత్పత్తులను ప్రదర్శించారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక, పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన స్టాల్ రాష్ట్రంలోని కళలు, హస్తకళలు, పర్యాటక ప్రదేశాల విశేషాలతో ఆకట్టుకుంది. ఎపి ఫుడ్ ప్రొసెసింగ్ సొసైటీ తదితర సంస్థలు కూడా తమ స్టాళ్లు ఏర్పాటు చేశాయి. సెంచూరియన్ యూనివర్శిటీ వంటి ప్రైవేటు విద్యా సంస్థలు కూడా స్టాళ్లు ఏర్పాటు చేశాయి. హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సంస్థ తమ స్టాల్ లో ఏర్పాటు చేసిన సైనిక హెలికాప్టర్లు, తేజస్ యుద్ధ విమానం నమూనాలు, ఇతర సైనిక ఉత్పత్తులను ప్రదర్శించింది.

గ్రామ వార్డు సచివాలయాలు, నైపుణ్యాభివృద్ధి, ప్రకృతి వ్యవసాయం, మహిళా స్వయంశక్తి గ్రూపులు, ఆప్కో, ఎపి ఇన్నోవేషన్ సొసైటీ, రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, విద్యా శాఖ, పునరుత్పాదక ఇంధన వనరులు తదితర ప్రభుత్వ శాఖలు తమ స్టాళ్లను ఏర్పాటు చేశాయి. ఐటిసి ఉత్పత్తులు, కియా ఎలక్ట్రిక్ కార్ల ప్రదర్శన, సౌర విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి సెంబ్ కార్ప్ తదితర స్టాళ్లు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, ఉషశ్రీ చరణ్, విడదల రజని, ఆర్‌కె.రోజా, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, చేనేత జౌళి శాఖ కార్యదర్శి సునీత, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి రజత్ భార్గవ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళారూపాలు

సమ్మిట్ ప్రారంభానికి ముందు ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంస్కృతికి అద్దం పట్టేలా నృత్య కార్యక్రమాలు నిర్వహించారు. అందులో రాష్ట్ర ప్రభుత్వ సాంప్రదాయ నృత్యాలైన వీరనాట్యం, తప్పెట గుళ్ళు, బుట్ట బొమ్మలు, కోలాటం, థింసా, లంబాడీ నృత్యాలను ప్రదర్శించారు. అనంతరం సభా వేదికపై 50 గ్రౌండ్లతో నిర్వహించిన లేజర్ షో విశేషంగా ఆకట్టుకుంది.

పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు

డిజిపి కె.రాజేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. 2500 మంది సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రత కల్పించారు. సిరిపురం రోడ్డు నుంచి ఎస్పీ బంగ్లా రోడ్డు ద్వారా అతిథులకు ప్రవేశం కల్పించారు అదేవిధంగా ఆంధ్ర యూనివర్సిటీలోని వైవిఎస్.మూర్తి ఆడిటోరియం ద్వారా ప్రభుత్వ అధికారులకు ప్రవేశం కల్పించారు. ఎక్కడికక్కడ హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశారు.

సదస్సులోకి అనధికార వ్యక్తులు

- సౌకర్యాల కల్పనలో నిర్వాహకులు విఫలం

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పెట్టుబడిదారుల కన్నా అనధికార వ్యక్తులే అధికంగా కనిపించారు. ఎయు గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఐదు ప్రాంగణాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టినా అనధికార వ్యక్తులు సమ్మిట్ ప్రాంగణంలోకి వచ్చేశారు. సదస్సు ప్రారంభమైన కొద్దిసేపటికే చాలా మంది ఒక్కసారిగా ప్రాంగణంలోకి ప్రవేశించారు. దీంతో కొన్నిచోట్ల తోపులాట కూడా చోటు చేసుకుంది. కొంతమంది తమకు క్యూఆర్ కోడ్ వచ్చిందని, తమ వాళ్లు లోపలున్నారని, వారి వద్ద పాసులున్నాయని చెప్పుకొచ్చారు. ఇంకొంతమంది డెలిగేట్స్ పాస్‌లతో ప్రత్యక్షమయ్యారు. నిజానికి డెలిగేట్స్ పాస్‌లు ఉన్నవారికి మధ్యాహ్నం మూడు తర్వాత ప్రవేశం అని ముందుగా ప్రకటించినా కొంతమందికి సమాచారం అందకపోవడంతో వారు ఉదయాన్నే సభా ప్రాంగణానికి చేరుకున్నారు. నిర్వాహకులు సామాన్యులకు, వ్యాపారవేత్తలకు అందరికీ డెలిగేట్స్ పాస్‌లు ఇవ్వడంతో వ్యాపారవేత్తలను పోలీసులు గుర్తించడం కష్టంగా మారింది. దీంతో చేసేదేమీలేక పోలీసులు అందరినీ లోపలికి అనుమతించారు. నిర్వాహకులు బార్ కోడ్‌ల సహాయంతో పాస్‌లు జారీ చేశారు. స్కానర్‌లు పనిచేయకపోవడంతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాక కొంతమందికి సాంకేతిక లోపాలు తలెత్తాయి. దీంతో క్యూఆర్ కోడ్ చూపిస్తే లోపలకు అనుమతించారు. ఐడి కార్డులుంటేనే లోపలకు అనుమతిస్తామని పోలీసులు చెప్పినప్పటికీ ప్రధాన ద్వారం వద్ద ఒకేసారి జనం గుంపులు గుంపులుగా వచ్చేయడంతో పరిస్థితి అదుపు తప్పింది. రిజిస్ట్రేషన్ చేయించుకుంటామని చెప్పి దబాయించి చాలా మంది లోపలకు వచ్చేశారు.

సౌకర్యాల కల్పన విషయంలో నిర్వాహకులు విఫలమయ్యారు. సభ ఉదయం 9 గంటలకు ప్రారంభం అవుతుందన్న సమాచారంతో అల్పాహారం ఉంటుందేమోనని చాలా మంది ఆశించారు. అప్పటికప్పుడు విమానాలు దిగి, సభా ప్రాంగణం వద్దకు చేరుకున్న డెలిగేట్స్‌కు తినేందుకు ఏమీ దొరకలేదు. మూత్రశాలల వద్ద నీటి సౌకర్యం సరిగా లేదు. లోపల ఏర్పాటు చేసిన కౌంటర్లో డబ్బులిస్తేనే ఫుడ్ అందిస్తామంటూ కొన్ని ప్రైవేట్ స్టాళ్ల నిర్వాహకులు చెప్పడంతో కొంత మంది ఇబ్బంది పడ్డారు. అంతర్జాతీయ సదస్సు జరుగుతున్న ప్రాంగణంలోకి దుమ్మూ ధూళి యథాతథంగా వచ్చేయడంతో నిర్వాహకులపై సమ్మిట్‌కు వచ్చిన వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.



తప్పెటగుళ్లుతో ఆకట్టుకున్న కళాకారులు

13 తర్వాత నీటి సరఫరా కార్మికుల సమ్మె

నిరవధిక సమ్మెకు వెళ్లనున్నట్లు చెప్పారు. సమ్మె పరిష్కారం పట్ల జివిఎంసి కమిషనర్, చీఫ్ ఇంజినీర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. యూనియన్ నాయకులు సిహెచ్.మోహన్, కె.వెంకటరావు, బి.త్రినాధరావు మాట్లాడుతూ తాము రెండు దశాబ్దాలుగా కేవలం రూ.13 వేలు వేతనంతో పనిచేస్తున్నామని చెప్పారు. ఇది చట్ట విరుద్ధమన్నారు. అన్ని నిత్యావసర వస్తువుల ధరలూ పెరిగిన నేపథ్యంలో చట్ట ప్రకారం రూ.18,500 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.

IN THE HON'BLE COURT OF THE V ADDL. JUNIOR CIVIL JUDGE, AT: VISAKHAPATNAM
O.S. 620/2022

Between :
Smt. Gandepalli Eswaramma
...Plaintiff
And:
Ponaganti Lakshmi & others
...Defendants

SUMMONS

To,
R-7: Badithaboyina Vikranth,
S/o. Appa Rao, NSTL, Type-5,
B-2 Quarters Buchirajpalem,
Visakhapatnam.
R-12: Meesala Raju, (female) ,
W/o. Sathibabu,Hindu,
aged about 45 years,
R/at N.S.T.L. Office Mess (QTR),
NAD X Road, Visakhapatnam.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you and the suit stands posted to **17-03-2023** for your appearance. Therefore, you are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **17-03-2023** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the suit will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
PUTCHALA NAGARAJU,
Advocate
Visakhapatnam,
Cell: 8099962288.

మహారాజశ్రీ భీమునిపట్నం ప్రధాన జూనియరు సివిలు జడ్జివారి కోర్టులో
O.S.327/2019

Between:
ఆమలకంటి ఉమామహేశ్వరరావు వగైరాలు
......వాదులు
And:
కోట మల్లిఖార్జున వరప్రసాద్ వగైరాలు
.....ప్రతివాదులు

To
D-5 పల్లి సన్యాసిరావు S/o లచ్చన్న, D.No. 6-74, చంద్రంపాలెం గ్రామం, మధురవాడ పంచాయతీ, చినగదిలి తాలుకా, విశాఖపట్నం జిల్లా.

పై నెంబరు దావాలో అనేకసార్లు పై కోర్టునుండి నోటీసులు పంపినా మీరు తీసుకోనందున మీకు నోటీసు నిమిత్తం పై దావా తే 7-3-2023దీకి వాయిదా వున్నది. కావున **తే 7-3-2023దీన ఉదయం 10-30గం॥**లకు మీరు పై కోర్టువారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనిచో పై దావా మీ పరోక్షమందు తీర్మాణించబడును.

ఇట్లు
J.Bheemasena Rao
Advocate for Plaintiffs
Vizianagaram, Cell: 9441053628

నిర్వహణలో నిర్లక్ష్యం

- నిరుపయోగంగా ఫైబర్ మరుగుదొడ్లు
- రన్నింగ్ వాటర్ సదుపాయం లేక మూలకు...
- అపరిశుభ్రతకు నెలవై వినియోగానికి దూరం
- అటకెక్కిన స్వచ్ఛభారత్ లక్ష్యం
- పట్టించుకోని జివిఎంసి

ప్రజాశక్తి -భీమునిపట్నం : 'ప్రతి అడుగు - పరిశుభ్రత వైపు నినాదం' ఆచరణలో ఎక్కడా కనబడని పరిస్థితి. స్వచ్ఛభారత్‌లో భాగంగా పలుచోట్ల ఏర్పాటు చేసిన ఫైబర్ మరుగుదొడ్లు రన్నింగ్ వాటర్ సదుపాయం లేక, అపరిశుభ్రంగా మారి చివరకు వినియోగానికి దూరమయ్యాయి. వీటిని ప్రారంభించడంలో ఉన్న హడావిడి, ఆర్భాటం, తర్వాత నిర్వహణలో ఏమాత్రం శ్రద్ధ చూపక పోవడం, పర్యవేక్షణ కొరవడడం, అధికారుల చిత్తశుద్ధి లేమి, ప్రజల్లో అవగాహన లేకపోవడం ఇలా అనేక కారణాలతో మరుగుదొడ్ల ఏర్పాటు లక్ష్యం నెరవేరలేదనే చెప్పాలి..

తగరపువలస శివాలయం వద్ద ఎనిమిది ఫైబర్ మరుగుదొడ్లు రన్నింగ్ వాటర్ సదుపాయంలో లేనప్పటికీ, కొన్నాళ్లపాటు కొందరు ఎత్తితెచ్చుకున్న నీటితో వీటిని వాడడంతో అపరిశుభ్రమయమై, చివరకు వాడలేని పరిస్థితి ఉంది. అలా ఇవి ఇపుడు నిరుపయోగంగా మారిపోయాయి. వీటి వల్ల అక్కడి పరిసరాలు కూడా అధ్వానంగా తయారయ్యాయి.

అలానే వై జంక్షన్ బస్ స్టాప్ సమీపాన ఏర్పాటు చేసిన ఈ తరహా మరుగుదొడ్లకు ఎట్టకేలకు వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసినప్పటికీ, సన్నని ధారతో నీరు వస్తుండడంతో వినియోగించే వారు చెప్పుకోలేని అవస్థలు పడుతున్నారు. విద్యుత్ ఎప్పుడు ఉంటుందో తెలియని పరిస్థితిలో ఒక్కోసారి చీకటిలోనే దీన్ని వినియోగించే వాళ్ల అవస్థలు పడుతున్నారు.



స్టోర్‌రూంగా మారిన ఫైబర్ లెట్రిన్

ఇక భీమిలి బీచ్ డచ్ సమాధులు ఎదురుగా ఏర్పాటు చేసిన పది ఫైబర్ మరుగుదొడ్లు వద్ద ఎట్టకేలకు ఏడాది తర్వాత మోటారు ఏర్పాటు చేయడంతో తాత్కాలికంగా నీటి సమస్య తీరింది. అంతకుముందు ఇక్కడి నిర్వాహకురాలు డ్రమ్ముల్లో నీటిని నింపి, బకెట్లతో వినియోగదారులకు అందించడం ద్వారా వీటి వినియోగానికి సహకరించింది. తాత్కాలికంగా నీటి సౌకర్యం తొలగినప్పటికీ ట్యాప్‌ల ఏర్పాటుతో రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని వినియోగదారులు అంటున్నారు.



తగరపువలస శివాలయం వద్ద నిరుపయోగంగా మరుగుదొడ్లు

మరుగుదొడ్లకు మరమ్మతులు

పర్యాటకులు, సందర్శకుల అవసరాల దృష్ట్యా స్థానిక బీచ్ పొట్టి శ్రీరాములు పార్కు సమీపాన ఉన్న మరుగుదొడ్లకు ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. ఒకటో జోన్ పరిధిలో 25 మరుగు దొడ్లు ఉండగా, వాటిల్లో శిధిలావస్థలో ఉన్న ఏడింటిని బాగుచేసినా వినియోగించే పరిస్థితి లేకపోవడంతో కూల్చేయనున్నారు. మిగిలిన 18 మరుగుదొడ్ల మరమ్మతు చేపట్టాలనే యోచనలో అధికారులున్నారు.

త్వరలో కేర్ టేకర్ల నియామకం

మరుగుదొడ్ల వద్ద త్వరలో కేర్ టేకర్ల నియామకం ద్వారా వీటి సక్రమ వినియోగానికి అధికారులు చర్యలు చేపట్టనున్నారు. మరుగుదొడ్ల వద్ద పర్యవేక్షణ లేకపోవడంతో మగ్గులు, బకెట్లు కనబడకుండా పోవడం, కొంతమంది ఆకతాయిల చేష్టల వల్ల ఒక్కోసారి వీధి దీపాలు పగిలిపోవడం లాంటి ఘటనలు జరుగుతున్నాయి. వీటిని కేర్‌టేకర్ల ద్వారా అరికట్టాలని అధికారులు నిర్ణయించారని స్పష్టమవుతోంది.

నేరాలు ఘోరాలు

కానిస్టేబుళ్లపై వాచ్‌మ్యాన్ దాడి

- ఇద్దరికి తీవ్రగాయాలు - ఒకరి పరిస్థితి విషమం



దాడిలో గాయపడ్డ కానిస్టేబుళ్లు

ప్రజాశక్తి -గోపాలపట్నం/ కంచరపాలెం : విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుళ్లపై మద్యం మత్తులో అపార్ట్‌మెంట్ వాచ్‌మ్యాన్ దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన గురువారం అర్ధరాత్రి కాకానినగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం ప్రకారం...కాకానినగర్‌లోని సాయిప్రియ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మ్యాన్‌గా పనిచేస్తున్న గోపి అనే వ్యక్తి అప్పటికే పెళ్లయి, ముగ్గురు పిల్లలున్న వితంతు మహిళతో సహజీవనం చేస్తున్నాడు. అపార్ట్‌మెంట్ సమీపంలోనే టిఫిన్ దుకాణాన్ని కూడా నిర్వహించేవారు.దీంతో మరింత అసహనానికి గురైన గోపి, గురువారం రాత్రి పూటుగా మద్యం తాగి, ఆ మత్తులో అపార్టుమెంట్‌లో నానారబస చేశాడు. ఇంట్లోని సామాన్లు విసిరేయడంతోపాటు నానా బీభత్సం సృష్టించాడు. దీంతో అపార్ట్‌మెంట్ వాసులు డయల్ 100కు ఫిర్యాదు చేయడంతో రామకృష్ణ, కిశోర్ అనే ఇద్దరు సంఘటనాస్థలికి చేరుకుని నానా గొడవ సృష్టిస్తున్న గోపిని వారించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ తగ్గకపోగా, తన వద్దనున్న సుత్తితో ఇద్దరు కానిస్టేబుళ్లపై దాడికి దిగాడు. ఈ ఘటనలో కానిస్టేబుళ్లిద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన కానిస్టేబుళ్లను సెవెన్‌హిల్స్ ఆసుపత్రిలో ఆరోగ్యభద్రత పథకం చేర్పించి వైద్యసేవలు అందిస్తున్నారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. జరిగిన ఘటనలపై కేసు నమోదు చేసిన ఎయిర్‌పోర్టు పోలీసులు, నిందితుని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



రాయుడు మృతదేహం

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్య పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని బక్రీదుపాలెం, బాబా కాలేజీ సమీపంలోని శ్మశానవాటికలో వ్యక్తి అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. పిఎంపాలెం సిఐ వై.రామకృష్ణ చెప్పిన వివరాల ప్రకారం మన్యం పార్వతీపురం జిల్లా సీతంపేట గ్రామానికి చెందిన బి.రాయుడు (35) మధురవాడ దరి బక్కన్నపాలెం న్యూడిల్స్ దుకాణంలో పనిచేస్తుండేవాడు. ఏమైందేమోగానీ బాబాకాలేజీ సమీపంలో శ్మశానవాటికలో అనుమానాస్పదరీతిలో శవమై కనిపించాడు. మృతుని కుటుంబీకులకు సమాచారం అందించామని, వారొచ్చిన తర్వాత ఫిర్యాదు మేరకు తదుపరి విచారణ చేపడతామని సిఐ రామకృష్ణ తెలిపారు.

జూలో వన్యప్రాణి దినోత్సవం



నేచర్ వాక్‌లో పాల్గొన్న జూ సందర్శకులు

ప్రజాశక్తి - ఆరిలోవ: ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని శుక్రవారం ఇందిరాగాంధీ జంతుప్రదర్శన శాలలో ఘనంగా నిర్వహించారు.. జూ పార్కులోని సీతాకోక చిలుకలు, వివిధ రకాల మొక్కలు, జంతు జీవాలను చూస్తూ సాగే నేచర్ వాక్‌తో పాటు గైడెడ్ బర్డ్ వాక్‌లో పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు. బర్డ్‌వాక్‌లో జూలోని వివిధ పక్షులు సమాచారాన్ని వివేక్ రాథోడ్ వివరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ క్యూరేటర్ అనంత శంకర్ మాట్లాడుతూ వన్యప్రాణుల వైవిధ్యం మానవ మనుగడకు కీలకమని, వాటిని సంరక్షించడం అందరి బాధ్యత అన్నారు. వన్యప్రాణుల సంరక్షణపై సమాజంలో అవగాహన, ఆలోచనను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, యువత, విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని మరింత బాధ్యతాయుతమైన పౌరులుగా మారేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం వైల్డ్ వాక్‌లో పాల్గొన్న వారికి ప్రత్యేక జ్ఞాపికలు, బహుమతులు అందజేసారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జూ ఎడ్యుకేషన్ బృందం వన్యప్రాణుల వైవిధ్యం, వాటి పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు

పెద్దిపాలెంలో అన్నసమారాధన

ప్రజాశక్తి - ఆనందపురం : మండలంలోని పెద్దిపాలెం పంతులు ఇంటి వద్ద అయ్యల సోమయాజుల నరేష్‌శర్మ, శ్రీలక్ష్మి దంపతులు నిర్మించిన మహాగణపతి అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి, నవగ్రహ, శిఖర, ధ్వజస్తంభ, పంచరాత్ర ప్రతిష్ట కార్యక్రమాన్ని సింహాచలం దేవస్థానం ఆస్థాన పండితుల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో మూడు వేల మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

ఆహారపు అలవాట్లు, జీవనశైలి...

పిల్లల్లో ఊబకాయానికి కారణం

కిమ్స్ ఐకాన్ ... కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, ఇంటర్వెన్షనల్ ఎండోస్కోపిస్ట్, డాక్టర్ చలపతిరావు ఆచంట




ప్రజాశక్తి -గాజువాక : పిల్లల్లో ఆహారపు అలవాట్లు, నేటి జీవనశైలి వారిని ఊబకాయుల్ని చేస్తోందని షీలాగనర్‌లోని కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ గ్యాస్ట్రోఎంటరాలజిస్టు, ఇంటర్వెన్షనల్ ఎండోస్కోపిస్ట్ డాక్టర్ చలపతిరావు ఆచంట అన్నారు. శుక్రవారం ప్రజాశక్తితో ప్రత్యేకంగా మాట్లాడుతూ, పిల్లలు బయట ఆటలకు దూరంగా ఉండడం, కనీస శారీరక శ్రమ చేయకపోవడం, కేలరీలు, కొవ్వులు అధికంగా ఉన్న ఆహారాన్ని తీసుకోవడం వల్ల శరీరంలో అధిక కొవ్వు పెరిగిపోయి ఊబకాయుల్ని చేస్తుందన్నారు. దీంతోపాటు అధిక శరీర బరువు, కొందరిలో జన్యుపరమైన కారకాలు, ఎండోక్రైన్ రుగ్మతలు, ఇంకాకొన్ని ఔషధాల పర్యవసానంగా ఊబకాయం వచ్చే అవకాశాలున్నాయన్నారు. పిల్లలలో శారీరక, మానసిక, సామాజిక శ్రేయస్సును ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్న ఊబకాయం వల్ల చిన్నారుల్లో టైప్-2 డయాబెటీస్, హైపర్ టెన్షన్, కొలెస్ట్రాల్ వంటి శారీరక రుగ్మతలు వచ్చే ప్రమాదముందని డాక్టర్ చలపతిరావు హెచ్చరించారు. ఊబకాయంతో వచ్చే అధిక బరువు వల్ల ఆస్తమా, శ్వాసకోశ సమస్యలు వచ్చే ప్రమాదముందని నివేదికలు వెల్లడిస్తున్నాయన్నారు. అధికబరువు వల్ల ఫ్యాటీ లివర్, ఎముకల సమస్యలు కూడా వచ్చే అవకాశముందన్నారు. ఊబకాయం పిల్లలతోపాటు యుక్త వయస్కుల్లోనూ వస్తోందని, 14.4మిలియన్ల స్థూలకాయులతో ప్రపంచంలోనే భారత్ రెండో స్థానంలో ఉందన్న భయంకర వాస్తవాన్ని గుర్తెరిగి తగు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ ఆచంట సూచించారు.

గీతంతో ఎంఒయుకు విదేశీ వర్సిటీల ఆసక్తి

ప్రజాశక్తి- మధురవాడ : పరిశోధన, విద్యా కోర్సుల్లో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంతో కలిసి పనిచేసేందుకు అవగాహన ఒప్పందాలను కుదుర్చు కోవడానికి పలు విదేశీ వర్సిటీలు ఆసక్తి కనబరుస్తున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం అమెరికాలోని ప్రఖ్యాత లూయిస్‌విల్లే విశ్వవిద్యాలయం సాంప్రదా యేతర ఇంజనీరింగ్ పరిశోధన విభాగం కాన్‌సెంటర్ డైరక్టర్ ప్రొఫెసర్ మహేంద్ర సుంకర గీతం వర్సిటీని సందర్శించారు తమ విశ్వవిద్యాలయ ప్రయోగశాలలో అభివృద్ధి చేసిన కృత్రిమ వజ్రాలు, ఇతర ఉత్పత్తులను వివరించారు. లూయిస్‌విల్లే వర్సిటీ అందిస్తున్న వివిధ కోర్సులు, పరిశోధనలను వివరిస్తూ, గీతంతో కలిసి పిజి, పరిశోధన విభాగాలను అభివృద్ధి చేయడానికి ఆసక్తి కనబరిచారు. అనంతరం గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ విభాగాలను సందర్శించారు.

యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్, బయోమెడికల్ ఇంజనీరింగ్ విభాగం వ్యవస్థాపక అధిపతి ప్రొఫెసర్ విజయ్ వైద్యనాథన్ కూడా గీతం వర్సిటీని సందర్శించి బయోటెక్నాలజీ విభాగం విద్యార్థులతో సమావేశమయ్యారు. బయోమెడికల్ ఇంజనీరింగ్‌కు పెరుగుతున్న ప్రాధాన్యత, పరిశోధనలు, ఉన్నత ఉపాధి అవకాశాలను వివరించారు. తమ విశ్వవిద్యాలయం పరిశోధనలలో భారతీయ విద్యార్థులు సాధిస్తున్న ప్రగతిని వివరించారు.. కార్యక్రమంలో గీతం బయోటెక్నాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఖాసీంబీ, కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరక్టర్ ఎస్.వంశీ కిరణ్, డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా చైతన్యంపై 'గీతం'లో వాక్‌థాన్



వాక్‌థాన్‌లో పాల్గొన్న గీతం విద్యార్థులు

ప్రజాశక్తి- మధురవాడ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఈ ఏడాది ముందస్తుగా పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా శుక్రవారం. గీతం మహిళా సాధికారిత విభాగం ఆధ్వర్యంలో మహిళా చైతన్యంపై నిర్వహించిన వాక్‌థాన్‌ను గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, సమాజంలో అన్ని రంగాలలో పురుషలతో సమానంగా మహిళలు రాణిస్తున్నారని, మహిళా విద్య ద్వారానే సమాజంలో ప్రగతి సాధ్యమన్నారు. మహిళా చైతన్యంపై ర్యాలీలో విద్యార్థులు బోర్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, జిమ్‌సర్ ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.గీతాంజలి, గీతం మహిళా సాధికారిక విభాగం ఛైర్‌పర్సన్ డాక్టర్ మాధురి ఖాశీ, ప్రముఖ క్రీడాకారిణి ఉషశ్రీ పాల్గొన్నారు.

విలేకరులపై అనుచిత వ్యాఖ్యలకు ముత్తంశెట్టి క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి -మధురవాడ : చంద్రంపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఎన్నికల నిబంధనలను కాలరాస్తూ ప్రచారం నిర్వహించారని వార్తలు రాసిన పత్రికా విలేకరులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు బేషరతుగా విలేకర్లకు క్షమాపణ చెప్పాలని మధురవాడ జోన్ సిఐటియు ప్రధాన కార్యదర్శి పి రాజకుమార్ డిమాండ్ చేశారు. పత్రికా విలేకర్లపై ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. నియమ, నిబంధనలను ఉల్లంఘించడంపై వాటిపై ప్రశ్నించిన అధికారులపైనా, వార్తలు రాసిన విలేకర్లపైనా ఎమ్మెల్యే ముత్తంశెట్టి దురుసు ప్రవర్తనను తప్పుబట్టారు. దీనిపై తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని కోరారు. అలాగే పాఠశాలల వేళల్లో నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం నిర్వహించడమేకాక, పరీక్షలు సమీపిస్తున్న వేళఉపాధ్యాయుల విలువైన సమయాన్ని వృథా చేసిన ముత్తంశెట్టి వ్యవహారంపై ఎన్నికల సంఘం దృష్టి పెట్టి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

కేంద్ర బడ్జెట్‌పై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న విశ్రాంత ప్రొఫెసర్ రామకృష్ణారావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎస్‌విఎల్‌ఎన్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం 'కేంద్ర బడ్జెట్-2023, భారతదేశ ఆర్థిక స్థితిగతులు' అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా పాల్గొన్న ఎయు, డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విశ్రాంత ప్రొఫెసర్ బి.రామకృష్ణారావు మాట్లాడుతూ, బడ్జెట్‌లోని సమ్మిళిత అభివృద్ధి, అవస్థాపన పెట్టుబడులు, పర్యావరణ పరిరక్షణ, యువశక్తి వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ బడ్జెట్ సామాన్యులకు, వేతన జీవులకు ఉపయోగకరంగా ఉందన్నారు. బడ్జెట్‌లో సింహభాగం మౌలిక వసతులకు కేటాయించినందున ఆర్థిక వ్యవస్థ వృద్ధికి దోహదపడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల, అర్ధ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎంవి రమణ, అధ్యాపకులు పాల్గొన్నారు

ఆలోచింపజేసిన ఎక్స్‌పో


నమూనా ప్రాజెక్టులను పరిశీలిస్తున్న జిఎస్‌ఎన్.రాజు

ప్రజాశక్తి-ఆనందపురం : శొంఠ్యాం దరి డాక్టర్ నడింపల్లి సత్యనారాయణరాజు ఇంజనీరింగ్ కళాశాల (ఎన్‌ఎస్‌ఆర్‌టి)లో ఇసిఇ విద్యార్థులు ప్రదర్శించిన ఎక్స్‌కో ఆలోచింపజేసేదిగా ఉంది. విద్యార్థులు తమ సాంకేతిక, సృజనాత్మకత, నైపుణ్యాన్ని మేళవించి వివిధ ప్రాజెక్టులను రూపొందించి ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రదర్శించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రస్తుతం విజయనగరం దరిసెంచూరియన్ యూనివర్సిటీ ఉపకులపతి, డాక్టర్ జిఎస్‌ఎన్.రాజు ముఖ్య అతిథిగా పాల్గొని, విద్యార్థులు తయారు చేసిన నమూనా ప్రాజెక్టులను పరిశీలించారు.

ఈసందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని సంకల్పం చేసి, సమాజ, దేశ సమస్యలను పరిష్కరించడం, అభివృద్ధి చేయడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మురుగుదాస్, సెక్రటరీ ప్రసాద్‌రాజు, ట్రెజరర్ కనక రాజు, ఇసిఇ విభాగం హెడ్ శివప్రసాద్, అధ్యాపక బందం పాల్గొన్నారు.

బిసి రోడ్డులో వీధి దీపాలు వేయాలి

సిఐటియు ఆధ్వర్యాన కొవ్వొత్తులతో నిరసన


వెలిగించిన కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి -గాజువాక : బిసి రోడ్డులో వీధిదీపాలు వేసి, వెలిగించే చర్యలు చేపట్టాలని కోరుతూ పెదగంట్యాడ జంక్షన్ నుంచి సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి వెలిగించిన కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు పాల అప్పలరెడ్డి, మురుకూటి వెంకటరావు మాట్లాడుతూ, బిసి రోడ్డులో వీధి దీపాలు లేక అంధకారంగా ఉండడంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో విధులు ముగించుకుని ఇళ్లకు వచ్చే స్టీల్ ప్లాంట్ ఉద్యోగస్తులు చీకట్లో నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మార్గంలో రోడ్డు గోతులమయంగా ఉండడం, డివైడర్లు సరిగా లేకపోవడం, అక్కడక్కడా ఉన్న స్పీడ్‌బ్రేకర్ల వద్ద జీబ్రా లైన్లుగానీ, హెచ్చరిక బోర్డులు గానీ లేకపోవడంతో ఇక్కట్లు పడే దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక ఆదానీ గంగవరం పోర్ట్ యాజమాన్యం ఇష్టానుసారంగా లారీలను బ్రిడ్జి కింద తిప్పుతున్నారన్నారు. దీంతో అటుగా వెళ్లే వాహనదారులతోపాటు స్టీల్‌ప్లాంట్ ఉద్యోగస్తులకు అసౌకర్యానికి గురికాక తప్పడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత జివిఎంసి యంత్రాంగం స్పందించి, బిసి రోడ్డులో వీధిదీపాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరారు. నిరసన ప్రదర్శనలో సిఐటియు నాయకులు పాల శ్రీనివాసరెడ్డి, రెడ్డి బాబు, చిన్న అప్పారావు, కృష్ణమూర్తి, బి వెంకటరావు, బైరెడ్డి గుర్రప్ప, కణితి అప్పలరాజు, శంకర్ పాల్గొన్నారు.

పెంచిన వంటగ్యాస్ ధరలను తగ్గించాలి

సిపిఐ ఆధ్వర్యాన నిరసన



ధర్నా చేస్తున్న సిపిఐ నేతలు

ప్రజాశక్తి-సీతమ్మధార: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇష్టారాజ్యంగా పెంచిన వంటగ్యాస్ ధరలు తగ్గించాలని సిపిఐ నాయకులు జీ వామనుమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్‌లో సిపిఐ ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ధర్నాను ఉద్దేశించి వామనుమూర్తి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వస్తే 100 రోజుల్లో డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్, నిత్యవసర వస్తువుల ధరలు తగ్గిస్తామని ప్రజలకు హామీ ఇచ్చిన బిజెపి ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోడీ, అధికారపగ్గాలు చేపట్టి ఎనిమిదేళ్లవుతున్నా ఇచ్చిన హామీని నిలబెట్టుకుని, ధరలను తగ్గించకపోగా, రివర్స్‌లో ఆకాశాన్నంటేలా ధరలను పెంచుకుంటూపోయి, ప్రజలను నమ్మించి నయవంచనకు గురిచేశారని మండిపడ్డారు. ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని, పెంచిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా ప్రజలంతా ఉద్యమిస్తే కేంద్ర ప్రభుత్వం మెడలు వంచక తప్పదని హెచ్చరించారు. ధరాభారంతో దేశవ్యాప్తంగా పేద మధ్యతరగతి ప్రజలను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్న మోడీ సర్కార్, గుజరాత్‌లో అతని గ్రూపునకు రూ 10 లక్షల కోట్ల రాయితీలు ఇవ్వడం దుర్మార్గమన్నారు. వంటగ్యాస్, ఇతర ధరలకు వ్యతిరేకంగా రాష్ట్రంలోని అధికార ఉన్న వైసిపి, ప్రధాన ప్రతిపక్షం టిడిపితోపాటు బిజెపి దత్తపుత్రుడైన పవన్‌కల్యాణ్ ఉద్యమించాలని, లేకుంటే ప్రజాగ్రహానికి గురికాకి తప్పదని హెచ్చరించారు. పెంచిన గ్యాస్ ధరుపై ఎంపీలు మంత్రులు తమ వైఖరిని ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు కార్యక్రమంలో సిపిఐ నాయకులు అబ్దుల్ రజాక్, కాంద్రేగుల రాము, బి రాము, పి సాయి, ఎ.కృష్ణ, పి ప్రసాద్, సూరిబాబు పి జయలక్ష్మి రణబీర్ సింగ్ పాల్గొన్నారు.

కమనీయం... అనంత పద్మనాభుని కల్యాణం


అనంతుని కల్యాణంలో ఎదురు సన్నాహక వేడుక

ప్రజాశక్తి - పద్మనాభం : మండల కేంద్రమైన పద్మనాభంలో కొండపై ఉన్న కుంతీమాధవస్వామి ఆలయంలో అనంత పద్మనాభస్వామి కల్యాణం శుక్రవారం కమనీయంగా జరిగింది. ముందుగా అలయంలోని ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై అనంతుని, పల్లకిలో శ్రీదేవి,భూదేవి విగ్రహాలను పల్లకిలో ప్రతిష్టించి, గాలిగోపురం ముందు నుంచి తూర్పు వైపునకు అనంత పద్మనాభుని ఊరేగింపును, ఆలయం వెనుక నుంచి పడమర వైపునకు శ్రీదేవి భూదేవి విగ్రహాలను పల్లకిపై ఉంచి ఊరేగించారు. ఆలయ ప్రధానార్చకులు సీతారామాంజనేయులు, ఇతర అర్చక బృందం మంత్రోచ్చారణల మధ్య సాగిన ఊరేగింపు, పద్మనాభం రాజవీధుల గుండా సాగి, తాలాడ వీధిలో ఎదురెదురుగా కలుసుకోవడం ద్వారా ఎదురు సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అనంతునితోపాటు శ్రీదేవి భూదేవి ఉత్సవ విగ్రహాలను ఒకేమార్గంలో ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చి, రాత్రి ఎనిమిది గంటల నుంచి 11గంటలకు స్వామి, ఉభయ దేవేరుల కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు.

దేదీప్యమానంగా పద్మనాభుని ఆలయం

అనంత పద్మనాభుని కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని కల్యాణ వేదిక కుంతీమాధవస్వామి ఆలయాన్ని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగవైభవంగా తీర్చిదిద్దారు. ఆలయం బయట విద్యుద్దీపాలతోనూ, ఆలయం లోపల వివిధ పుష్పాలతో అలంకరించారు. గాలిగోపురం నుంచి భక్తులు వచ్చే మార్గం పొడుగునా విద్యుద్దీపకాంతులతో ధగధగలాడింది. ప్రత్యేక అలంకరణలో కుంతీమాధవస్వామి భక్తులను విశేషంగా అలరించారు. సమీప మద్ది, ఇసుకలపాలెం, రెడ్డిపల్లి, అర్చకునిపాలెం, కృష్ణాపురం, అనంతవరం, బోని, శిర్లపాలెం,విలాస్‌ఖాన్ పాలెం, కుర్రపల్లి, పొట్నూరు, తునివలస తదితర పరిసర గ్రామాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి అనంతుని కల్యాణవేడుకలో పాల్గొన్నారు. ఎంపిపి కంటుబోతు రాంబాబు ఆధ్వర్యంలో భక్తుల సహాయ, సహకారాలతో నిర్వహించిన వేడుకలో ఆలయ ఇఒ నానిబాబు పాల్గొన్నారు.

ప్రజా సంపద లూటీ ఆపాలి

గో బ్యాక్ అదానీ : డివైఎఫ్‌ఐ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న డివైఎఫ్‌ఐ నేతలు

ప్రజాశక్తి-కలెక్టరేట్/ కంచరపాలెం : ప్రజల సంపద లూటీ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం నిలుపుదల చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యుఎస్‌ఎన్ రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం తాటిచెట్లపాలెం జంక్షన్ వద్ద 'గో బ్యాక్ అదానీ' పేరిట డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ప్రభుత్వం గ్లోబల్ సమ్మిట్ కు అదానీని ఆహ్వానించడం సరైంది కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం అదానీకి దేశ సంపదను దోచిపెడుతుందని విమర్శించారు. పోర్టులు , ప్రభుత్వ కంపెనీలు, గనులు, వనరులు అన్నింటిని ఆదానీకి అప్పజెప్పడం అంటే దేశ ప్రజలను మోసం చేయడమేనని దుయ్యబట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక చర్యలను ప్రపంచమంతా గమనిస్తోందని, ఇప్పటికైనా వీటికి చరమగీతం పాడి దేశ గౌరవాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. .ప్రజలు చెల్లించే పన్నులను లూటీ చేస్తున్న వారికి రెడ్ కార్పెట్ పరుస్తూ ఆహ్వానించడం, అతిథి మర్యాదలు చేయడం ఎంతమాత్రం సబబు కాదని హెచ్చరించారు. కార్యక్రమంలో పౌర సంఘం నాయకులు గౌరీష్, జ్యోతి, సుందరి, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు శివ పాల్గొన్నారు.

ఎస్‌బిసి బ్రిడ్జిపై రాకపోకలకు అనుమతించండి

సిపిఎం ఆధ్వర్యాన పలు ప్రాంతాల్లో నిరసన

ప్రజాశక్తి -ములగాడ : డాక్‌యార్డు బ్రిడ్జిని బాగుచేసి, దానిపై రాకపోకలను యథావిధిగా పునరుద్ధరించే వరకు పక్కనే ఉనన ఎస్‌బిసి బ్రిడ్జిపై ప్రజా వాహనాల రాకపోకలకు అనుమతించాలని సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం 40వవార్డు ఎఎస్‌సి, 59వ వార్డు నెహ్రూనగర్ లేబర్ జంక్షన్, 62వవార్డు త్రినాధపురం జంక్షన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ, ప్రజల అవసరాలు, వారి ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లా యంత్రాంగం నేవల్ డాక్‌యార్డు అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జోన్ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, కె.పెంటారావు, పిసిని రామారావు ఎల్ .కృష్ణఅర్జునరావు, ఎ.సత్యారావు, బాల, పైడిరాజు, గోవింద్ సత్తిబాబు జె.వెంకటేష్ సురేష్ సుభానీ మోహన్, కుమార్ , ప్రశాంత్, నానీ, నవీన్ పాల్గొన్నారు.

వైసిపి ఎన్నికల ప్రచారంలో వాలంటీర్లు

నిబంధనల ఉల్లంఘనపై కఠిన చర్యలకు సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో వాలంటీర్ల వ్యవస్థను అధికార వైసిపి యథేచ్ఛగా వాడుకుంటోందని, సిఐటియు గోపాలపట్నం డివిజన్ కమిటీ కార్యదర్శి బలివాడ వెంకటరావు విమర్శించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎటువంటి విధుల్లోనూ, ప్రచారంలోనూ వాలంటీర్లు పాల్గొనరాదని ఎన్నికల సంఘం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ వాటన్నింటినీ ఉల్లంఘించి, వైసిపి నేతలు రాజకీయ లబ్ధి కోసం వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థిని ఇంటింటికీ వెళ్లి వాలంటీర్ల ద్వారా పరిచయ కార్యక్రమాలను నిర్వహిస్తూ, ఓటేయాలని ఒత్తిడి చేయడంతోపాటు ప్రలోభపెట్టి బెదిరిస్తున్నారని విమర్శించారు. దీనిపై ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఇప్పటికే ఫిర్యాదు చేశామన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన వైసిపి అభ్యర్థిపైనా, వాలంటీర్ల పైనా నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకోవాలని వెంకటరావు డిమాండ్ చేశారు.

తవ్వి వదిలేశారు..

- వారం రోజులైనా తాగునీటి పైపులైన్ల పనులు చేపట్టని వైనం
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ఆరు గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్

రోజూ వందలాది మంది ప్రయాణం సాగించే యలమంచిలి- పెద్దపల్లి ప్రధాన రహదారిలో తాగునీటి పైపు లైన్ల నిర్మాణానికి తవ్వి, పనులు చేపట్టకుండా వదిలేయడంతో ఈ మార్గంలో ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జల్ జీవన్ మిషన్ పథకం నిధులతో ఇంటింటికి కుళాయిల ఏర్పాటుకు పైపులైన్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా కాంట్రాక్టర్లు యలమంచిలి- పెద్దపల్లి ప్రధాన రహదారిలో యలమంచిలి రైల్వే గేట్ నుండి రామ్‌నగర్ కాలనీ మీదుగా బైపాస్ వరకు కిలో మీటరన్నర మేరకు జెసిబితో కాలువ తవ్వి ఆ మట్టిని రహదారి మధ్యలో వేశారు. కాలువ తవ్వి వారం రోజులైన నేటికీ పైపులైన్ల నిర్మాణ పనులు చేపట్టలేదు. ఈ మార్గంలో పెద్దపల్లి, మంత్రిపాలెం, పెదగొల్లల పాలెం, చినగొల్లల పాలెం, వెంకటా పురం, నవాబుపేట తదితర ఆరు గ్రామాలకు చెందిన వందలాది మంది ప్రజలు నిత్యం ప్రయాణం సాగిస్తూ ఉంటారు. వారం రోజులుగా రహదారికి మధ్యలో వేసిన మట్టిని తీయకపోవడంతో ఈ మార్గంలో వాహనాలపై రాకపోకలు సాగించడం కష్టంగా మారింది. దీంతో ఈ ఆరు గ్రామాల ప్రజలు నాలుగు కిలోమీటర్ల మేరకు అదనంగా ప్రయాణించడంతో పాటు రైల్వే గేట్ పడితే అరగంట పాటు అక్కడే నిరీక్షించాల్సి వస్తోంది. రాంనగర్ కాలనీ వాసులు కూడా రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇటువంటి మార్గాల్లో పనులు చేసేటప్పుడు 100 నుండి 200 మీటర్ల మేరకు తవ్వి పైపులైన్లు వేసి, పూడ్చివేసిన తరువాత మళ్లీ తవ్వకాలు చేసి పైపులైన్లు వేయాల్సి ఉంది. గతంలో అనేక ప్రాంతాల్లో ఇలాగే చేశారు. కాని ఇక్కడ కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా కిలోమీటరన్నర తవ్వి రోడ్డు మధ్యలోనే మట్టిని వారం రోజులుగా వదిలేశారు.

మరో వైపు కాంట్రాక్టర్లు పైపులైన్ల కోసం సీసీ రోడ్లు, తారు రోడ్లు అనే తేడా లేకుండా జెసిబితో ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. దీంతో రోడ్ల పూర్తిగా ధ్వంసమవుతున్నాయి. శుక్రవారం మున్సిపాలిటీ పరిధి ఎర్రవరంలో పైపులైన్ వేయడానికి సిసి రోడ్డు మధ్య నుండి కాలువ తవ్వారు. అలాగే ఇప్పటికే తాగునీరు అందిస్తున్న పైపులైన్ కూడా పగిలి నీరు వృథాగా పోతుందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై ఈ పనులు చేపట్టే వారిని ప్రశ్నించగా, పైపులైన్లు వేసేటప్పుడు రోడ్లు శిథిలం కావడం సహజమేనని చాలా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్ల పనులు త్వరితగతిన పూర్తి చేయించి తమ రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని, ధ్వంసమైన రోడ్లను సదరు కాంట్రాక్టర్లు చేత మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



తవ్వి రోడ్డుపై మట్టి వేసి వదిలేసిన దృశ్యం



ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు

124వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి-రాంబిల్లి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వాడనర్సాపురం వద్ద ఎన్ఎఓబి ప్రధాన గేట్ ముందు నేవీ నిర్వాసితులు చేస్తున్న ఆందోళన 124వ రోజుకు చేరింది. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జెఎసి పెద్దలు మాట్లాడుతూ ప్రత్యామ్నాయ నావికా స్థావరం నిర్మాణానికి సర్వం కోల్పోయిన తమకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. నేవీ నిర్మాణంతో సముద్రంలో చేపల వేట సాగక తమ ఉపాధి పోయిందని, తమ కుటుంబాల జీవనం సాగడం లేదని వాపోయారు. తమకు జీవన భృతి కల్పించాలని, జెట్టీ నిర్మాణం చేపట్టాలని, అంత వరకు నేవీ గేట్ లోపల నుంచి ఆధార్ కార్డు ఆధారంగా చేపల వేటకు అనుమతి ఇవ్వాలని, పెండింగ్ ప్యాకేజీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా తమ న్యాయమైన డిమాండ్లపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 8 గ్రామాల నిర్వాసితులు పాల్గొన్నారు.

నేడు వెంకటేశ్వరస్వామి పండగ

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలోని కింతాడ పంచాయతీ శివారు గంగాభవాని పాలెం గ్రామంలో కుబిరెడ్డి కుటుంబీకుల ఇలవేల్పు శ్రీ వెంకటేశ్వరస్వామి పండగను ఈ నెల 4న శనివారం నిర్వహించనున్నారు. శనివారం ఉదయం నుంచే పాత చెరువువద్ద 12మంది వేద పండితులతో హోమాలు నిర్వహించనున్నారు. 25ఏళ్ల కోసారి జరపనున్న శ్రీ వెంకటేశ్వరస్వామివారి పండుగలో జోగన్నపాలెం, గంగాభవానిపాలెం తదితర గ్రామాలకు చెందిన కుబిరెడ్డి కుటుంబాలువారు పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దేవుళ్ళు వద్ద మధ్యాహ్నం నిర్వహించనున్న అన్న సమారాధనలో భక్తులందరూ పాల్గొని శ్రీవెంకటేశ్వరస్వామి వారి అన్న, ప్రసాదాలు స్వీకరించాలని పండగ నిర్వాహకులు కోరారు.



తనిఖీలు చేస్తున్న ఆర్‌డిఒ చిన్నికృష్ణ

తహశీల్దారు కార్యాలయంలో ఆర్‌డిఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - పరవాడ

అనకాపల్లి రెవిన్యూ డివిజనల్ అధికారి జి చిన్నికృష్ణ పరవాడ తహశీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయ సిబ్బంది, వారి పనితీరుపై తహశీల్దార్ వి ప్రకాష్ రావును అడిగి తెలుసుకొని ఒక్కొక్కరిని పిలిచి విచారణ చేశారు. స్పందన, ఆర్‌టిఐ దరఖాస్తులపైనా, సమగ్ర భూ రీ సర్వే పైనా, పట్టాదారు పాసుపుస్తకాల దరఖాస్తులపైనా ఎటువంటి ఆలస్యం చేయకుండా పనితీరు మెరుగు పరచాలని తహశీల్దారును ఆదేశించారు.

కశింకోట మండలంలో కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి - కశింకోట

కశింకోట మండలంలో జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి శుక్రవారం పర్యటించారు. కశింకోట పంచాయతీ పరిధిలో భూముల సర్వేలో భాగంగా హద్దురాళ్ళు వేయడాన్ని పరిశీలించారు. హద్దురాళ్ళు వేయటానికి ఎంతమంది కూలీల అవసరం ఉంటుంది, రోజుకు ఎన్ని సర్వే పాయింట్లు ఇవ్వగలరు తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం తీడ గ్రామపంచాయతీలో అమృత్ సరోవర్‌లో భాగంగా జరుగుతున్న మాలపాటి చెరువు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎంత మంది ఉపాధి కూలీలతో పని చేస్తున్నారో సిబ్బందిని అడిగారు. ఉపాధి హామీ పథకం ఎంత గిట్టుబాటు వస్తుందో తెలుసుకున్నారు. చెరువు మొత్తం రూ.14.50 లక్షలతో అభివృద్ధి చేయడం జరిగిందని, సుమారుగా 150 ఎకరాలు భూమికి నీరు అందుతుందని, చెరువుగట్టుపైన 80 కొబ్బరి మొక్కలను పెంచుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ అదనపు పథక సంచాలకులు రోజారాణి, ఎంపిడిఓ కొంకి అప్పారావు, ఇన్‌ఛార్జి తహశీల్దారు సురేష్ నాయుడు, ఏపిఓ శివ పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని గాలిభీమవరం గ్రామంలోని ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. నాగభూషణరావు మాట్లాడుతూ సబ్బవరం సూర్య మల్టిస్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో రక్తదాన శిబిరాన్ని, ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో ఫస్ట్ బ్లడ్ బాంక్ వారి సౌజన్యంతో 43 మంది విద్యార్థులు రక్తదానం చేసినట్లు చెప్పారు. సూర్య హాస్పిటల్ డాక్టర్ వి. దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో సుమారు 300 మంది విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న లక్ష్మణ్, దుర్గాప్రసాద్


ప్రజాశక్తి-సబ్బవరం

గ్రామీణ యువకులు క్రీడల్లో రాణించాలని అభయాంజనేయ ఆలయ కమిటీ చైర్మన్ వడిశల లక్ష్మణ్, ఉప సర్పంచ్ గోలజాన దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని గొట్టివాడ గ్రామంలో అభయాంజనేయ తీర్థ మహోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడా పోటీలను వడిశల లక్ష్మణ్, గోళాజాన దుర్గాప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. క్రీడలు దేహ దారుఢ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొంది స్తాయన్నారు. ఈ పోటీలలో జిల్లా నలుమూలల నుండి 18 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి రూ.12 వేలు, ద్వితీయ బహుమతి రూ.7వేలు, తృతీయ బహుమతి రూ.5వేలు చొప్పున అందజేస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంటి, హరికృష్ణ, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలకు నీరు అందించాలని రైతుల ఆందోళన

ప్రజాశక్తి-దేవరాపల్లి

తమ పంట భూములకు నీరు అందించాలని మండలంలోని వేచలం రెవెన్యూ పరిధిలో మహాపాత్రుని చెరువు దిగువ ఆయకట్టు రైతులు శుక్రవారం తహశీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ చెరువు దిగువన సుమారు 300 మంది రైతులు పంటలు పండించుకుంటున్నారని తెలిపారు. కొంతమంది పంట కాలువలకు అడ్డగోలుగా గొట్టాలు వేసి, మట్టి కప్పడంతో దిగువ ఆయకట్టు నీరు అందడం లేదని పేర్కొన్నారు. తక్షణమే పంట కాలువలు యథాతథంగా ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ డి.అరుణ్ చంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మహాపాత్రుని చెరువు ఆయకట్టు రైతులు కర్రి గోవింద, కర్రి సత్యం, వేచలపు గోవింద, రెడ్డి శేషగిరిరావు, కర్రి శ్రీరామ్మూర్తి, రెడ్డి బలరాం, రైతులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న రైతులు



పవన్ కల్యాణ్‌తో శ్రీనివాసరావు, రామదాసు

జనసేనలో వైసిపి, టిడిపి నాయకుల చేరిక

ప్రజాశక్తి అచ్యుతాపురం

మండలానికి చెందిన మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, వైసీపీ నాయకుడు శ్రీరామదాసు రామదాసు శుక్రవారం జనసేన ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జి సుందరపు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ వ్యవస్థాపకుడు పవన్ కళ్యాణ్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. వారికి పవన్ కళ్యాణ్ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. జనపరెడ్డి శ్రీనివాసరావు జెడ్‌పిటిసి సభ్యునిగా, టిడిపి జిల్లా కార్యదర్శిగా, నీటి సంఘ అధ్యక్షునిగా పదవులు నిర్వహించారు. రామదాసు ఎస్ఈజెడ్ దిబ్బపాలెం పునరావాస కాలనీ వాసుల సంక్షేమ సంఘ ప్రతినిధిగా, గ్రామ సర్పంచ్ బాధ్యతలు నిర్వహించారు.

జగన్‌కు ఓటమి భయం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఓట్లు అడిగే నైతిక హక్కు జగన్ ప్రభుత్వానికి లేదని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు అన్నారు. మండలంలోని తారకరామ కాలనీ, కొండ కొప్పాకలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా రాష్ట్రానికి జగన్ ప్రభుత్వం వల్ల ఒరిగింది ఏమీ లేదన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం ఓడిపోతుందని భయం జగన్మోహన్ రెడ్డికి పట్టుకుందన్నారు. ఉద్యోగులకు బకాయి పడ్డ డిఏలు చెల్లించాలని కోరిన ఉద్యోగుల సంఘాలకు సజ్జల రామకృష్ణారెడ్డి ఎన్నికల కోడ్ వల్ల ఇవ్వలేకపోతున్నామని చెప్పడం వారి అసమర్థతకు నిదర్శనమన్నారు. ఇటువంటి బూటకపు ప్రకటనలు ఉద్యోగ ఉపాధ్యాయులు నమ్మే పరిస్థితి లేదని హితవుపలికారు. వైసిపి హయాంలో అనేక మంది పారిశ్రామికవేత్తలు వెనక్కి వెళ్లిపోయారన్నారు. విశాఖపట్నంలో వేలకోట్ల రూపాయల ప్రభుత్వ భూములను విజయసాయిరెడ్డి దోచుకున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో విశ్రాంత ఉపాధ్యాయ నాయకులు బుద్ద కాశి విశ్వేశ్వరరావు, జిల్లా నాయకులు కాండ్రేగుల సత్యనారాయణ పాల్గొన్నారు.

10 నుంచి రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ తైక్వాండో పోటీలు

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్ : యలమంచిలి వైయస్సార్ ఇండోర్ స్టేడియం వేదికగా ఈనెల 10వ తేదీ నుంచి 12 వరకు రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ తైక్వాండో పోటీలు జరగనున్నాయి. స్థానిక తైక్వాండో క్లబ్ వీటికి సన్నాహాలు చేస్తుంది. ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి 500 మంది బాలురు, బాలికలు, టీం మేనేజర్లు, కోచ్ లు, 13 జిల్లాల కార్యదర్శులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల నిర్వహణలో భాగంగా ఎలమంచిలి తైక్వాండో క్లబ్ అసోసియేషన్ సత్య స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు భాగస్వాములయ్యారు.

కెజిహెచ్‌కు వెళ్లి పింఛన్ అందజేత

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని ఈ.చౌడువాడ (కన్నూరుపాలెం) గ్రామం పింఛను దారుడు కాండ్ర అప్పారావు రోడ్డు ప్రమాదంలో గాయపడి విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతుండగా, ఆయనకు గ్రామ వాలంటీరు పైల దేవి తన సొంత ఖర్చులతో కెజిహెచ్‌కు వెళ్లి శుక్రవారం పింఛను అందజేశారు. సదరు వాలంటీరును పంచాయతీ కార్యదర్శి ఎస్.సత్యారావు, సచివాలయ సిబ్బంది అభినందించారు.



కెజిహెచ్‌లో పింఛన్ అందజేస్తున్న వాలంటీరు దేవి

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని ధర్నా



కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ఆప్ నాయకులు

ప్రజాశక్తి- అనకాపల్లి

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని కోరుతూ శుక్రవారం ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో నెహ్రూ చౌక్ జంక్షన్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కొణతాల హరినాథ్ బాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి సామాన్య ప్రజల సంక్షేమం పట్టలేదన్నారు. గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలు అదుపులో ఉన్నప్పుడే నిత్యవసర వస్తువుల ధరలు నియంత్రణలో ఉంటాయని తెలిపారు. కార్పొరేట్లకు మేలు చేస్తూ బీద సామాన్య ప్రజలపై కేంద్రం భారాలు మోపడం దారుణమన్నారు. అనేక ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టడం ప్రైవేటీకరణ చేయడంతో దేశంలో ఉపాధి అవకాశాలు దారుణంగా దెబ్బతిన్నాయని, వ్యవసాయ రంగాన్ని కేంద్రం కుదేలు చేసిందని విమర్శించారు. సామాన్యులకు నిత్యవసర వస్తువుల ధరలు అందుబాటులో ఉండేలా కేంద్రం చర్యలు చేపట్టాలని, తక్షణమే పెంచిన గ్యాస్ ధర తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు సిహెచ్ శ్రీనివాసరావు, ఎం జగన్నాధరావు, పి బాబ్జి, ఎన్ అప్పారావు, టి రామచంద్రరావు, పి లక్ష్మణరావు, కే నూకరాజు పాల్గొన్నారు.

స్నేహితుని పాడె మోసిన మాజీ ఎమ్మెల్సీ



పాడె మోస్తున్న మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు,



సింహాచలం (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి-అచ్యుతాపురం

తెలుగుదేశం పార్టీలో తన చిరకాల స్నేహితుడు సన్యాసినాయుడు అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు ఆయన పాడె మోశారు. ఎర్రవరం గ్రామానికి చెందిన నర్మల సన్యాసినాయుడు (95) గ్రామంలో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసున్న చలపతిరావు ఎర్రవరం గ్రామానికి వచ్చి సన్యాసినాయుడు మృత దేహంపై పూలదండ వేసి నివాళులర్పించారు. కుటుంబీకులను పరామర్శించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. ఈ విధంగా చిరకాల స్నేహితుని రుణం తీర్చుకున్నారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ సన్యాసినాయుడు మృతి టిడిపికి తీరని లోటని చెప్పారు. పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేనివని తెలిపారు. సన్యాసినాయుడు మృతి పట్ల గ్రామ సర్పంచ్ గంగిరెడ్డి లక్ష్మి, మాజీ సర్పంచ్ గంగిరెడ్డి రాము, వైసీపీ సీనియర్ నాయకులు కోన బుజ్జి, ఎం సూర్యనారాయణ, భీముని నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, పిన్నమరాజు వాసు, టిడిపి నాయకులు గుడేల కనకారావు తదితరులు నివాళు లర్పించారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని గొట్టివాడ గ్రామంలో పశువులకు గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు శుక్రవారం వేశారు. ఈ సందర్భంగా ఆరిపాక పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.స్వర్ణలత మాట్లాడుతూ ఈ నెల ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు మండలంలోని పశువులకు గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గొట్టివాడ జెవిఓ కె.రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

బిందు సేద్యంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-వడ్దాది : బుచ్చయ్యపేట మండలం కొమ్మలపూడి గ్రామంలో గ్రామ సర్పంచ్ గేదెల వెంకయ్యమ్మ, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ ఆధ్వర్యాన ఉద్యాన శాఖ అధికారులు తుంపర్ల, బిందు సేద్యం పట్ల రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ వ్యవసాయం పట్ల ఆసక్తి ఉన్న రైతులకు సబ్సిడీతో కూడిన డ్రిప్ ఇరిగేషన్ సామాగ్రిని ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డ్రిప్ పద్ధతి పాటించడం వల్ల సమయం, పని, నీరు ఆదా అవడమే కాకుండా ప్రతి ఒక్క మొక్కకు నీరు అందడం వలన దిగుబడులు ఎక్కువగా వస్తుందని చెప్పారు. జామ, బొప్పాయి, పామాయిల్, కొబ్బరి తదితర పంటలు వేసుకుంటూ, అంతర్ పంటగా ఉల్లి, మిరప, అరటి, టమోటా లాంటి పంటలు కూడా వేసుకొని ఎక్కువ ఆదాయం పొందచ్చని తెలిపారు.

మగవారితో సమానంగా ఆడపిల్లలను చూడాలి

ప్రజాశక్తి-కశింకోట : సమాజంలో ఆడపిల్లల ప్రాముఖ్యతను గురించి, అన్ని రంగాలలో మగవారితో సమానంగా వారిని చూడాలని డిప్యూటీ డిఎంహెచ్ఓ రూఫ్సీ రాణి అన్నారు. మండలంలోని త్యేగాడ కస్తూరిబా పాఠశాలలో గురువారం రాత్రి భేటీ బచావో- భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలను తల్లి గర్భంలోనే తుంచడం అన్యాయమన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన వారికి శిక్ష తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో కశింకోట వైద్య అధికారి యశోద, కెజీబీవీ ప్రిన్సిపల్ డి.చంద్రకళ, ఆరోగ్య సిబ్బంది నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బోరుబావికి మరమ్మతులు

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ముత్యాలమ్మపాలెం పంచాయతీ సమ్మంగిపాలెం గ్రామంలో సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు చొరవతో బోరుబావికి శుక్రవారం మరమ్మతులు చేశారు. మంచినీటి సమస్య ఉందని చెప్పిన వెంటనే స్పందించిన సర్పంచ్‌కి గ్రామస్తులు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు సమ్మంగి సోమేశ్వరరావు, కణితి చినసోమేశ్వరరావు, అనిల్, పైడిరాజు పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ సుబ్బలక్ష్మి

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎంపిడిఒ తనిఖీలు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని నాగయ్యపేట, తామరబ్బ పంచాయతీల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిడిఒ సిహెచ్.సుబ్బలక్ష్మి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఆయా కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు ఇస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందుతుందా? లేదా అని ఆరా తీశారు. ఆరేళ్ల లోపు పిల్లలకు ఎనిమియా వ్యాధి సోకకుండా జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. బరువు తక్కువ పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అంగన్వాడీ రికార్డులు తనిఖీ చేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని ఎటువంటి తేడా వచ్చిన వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆయా పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను నేరుగా పరిశీలించి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లెక్కల లింగన్న, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి -మునగపాక రూరల్

మండలంలోని చూచుకొండ గ్రామంలో శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం, ధ్వజస్తంభ, గరుడ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. లీడర్ దినపత్రిక అధినేత వివి రమణమూర్తి, లలితా వాణిశ్రీ దంపతులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజ స్తంభ స్థాపన పూజలో పాల్గొని మొదటి కాంక్రీట్ వేశారు. వేద పండితులు రేజేటి గోపాలాచార్యులు, ప్రధాన అర్చకులు వెంకట కృష్ణమూర్తి శాస్త్రి, ఆలయ అర్చకులు కాశి ఆధ్వర్యంలో ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భారీ అన్న సమారాధనను రమణమూర్తి దంపతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు సుకుమార్ వర్మ, జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు, జెడ్పీ మాజీ చైర్మన్ లాలం భవానీ భాస్కరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు దొడ్డి సూరిఅప్పారావు, మాజీ ఎంపీటీసీ మారిశెట్టి వెంకట రమణ, శేఖర్, నాయుడు, గనపర్తి సర్పంచ్ చదరం నాయుడు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

7న పారిపల్లి అమ్మవారి పండగ

ప్రజాశక్తి- మునగపాక రూరల్

మండలంలోని వాడ్రాపల్లిలో ఈనెల 7వ తేదీన నిర్వహించనున్న పారిపల్లి అమ్మవారి మహోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆ గ్రామ సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు తెలిపారు. మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలోని అమ్మవారి గుడి వద్ద శుక్రవారం ఉత్సవ పోస్టరును మాజీ డిసిసిబి చైర్మన్ యు సుకుమార్ వర్మ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ అమ్మవారి పండగ మహోత్సవం సందర్భంగా ఉదయం నుండి భక్తుల దర్శనార్థం, ఎటువంటి అసౌకర్యం కలవకుండా ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, వైసిపి మండల కన్వీనర్ ఆడారి గణపతి అచ్చం నాయుడు, ఎలమంచిలి మార్కెట్ కమిటీ చైర్మన్ పిల్లి అప్పారావు, కోయిలాడ దశావతారం, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సుకుమార్ వర్మ, నూకరాజు తదితరులు


రోడ్డుపై వృథాగా పోతున్న నీరు

వృథాగా తాగునీరు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని చీడిగుమ్మల గ్రామంలో ప్రధాన రహదారిపై రక్షిత తాగునీరు వృధాగా పోతుంది. నిత్యం ప్రజలకు దాహం తీర్చే శుద్ధి చేసిన మంచినీరు రెండు పూటలా సరఫరా జరుగుతుంది. ప్రధాన రహదారిపై పైప్ లైన్‌కు భారీ రంధ్రం ఏర్పడడంతో తాగునీరు వృధాగా పోతుంది. గత 15 రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతుంది. తక్షణం మరమ్మతు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.


సీజ్ చేసిన వాహనాలు

మట్టి తరలిస్తున్న వాహనాలు సీజ్

ప్రజాశక్తి-మాకవరపాలెం:నింబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టరుతో పాటు జేసీబీని సీజ్ చేసినట్లు గనుల శాఖ ఏజే రవివర్మ తెలిపారు. మండలం లో రామన్నపాలెం ఏపీఐ ఐసీ భూముల్లో మట్టిని తరలిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో దాడులు నిర్వహించామ న్నారు. మూడు ట్రాక్టర్లతో పాటు జేసీబీని పట్టు కొని సీజ్ చేసినట్లు తెలిపారు.

సీతారామ ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో కొమిర గ్రామంలో సీతారామ ఆలయ వార్షిక మహోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది దంపతులు సామూహిక పూజలను ఆలయ అర్చకులు ఆరవెల్లి వెంకట్ గోపాల ఆచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు తగు ఏర్పాట్లు చేశారు.


పూజలు చేస్తున్న భక్తులు

నేడు జాబ్ మేళా

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:ఫార్మా కంపెనీలలో ఉద్యోగాలకు ఈనెల 4న స్థానిక శ్రీవిద్య డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కాలేజీ యాజమాన్యం పత్రికా ప్రకటనలో పేర్కొంది. శనివారం ఉదయం 9 గంటలకు ఆసక్తిగల నిరుద్యోగ యువకులు ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. నిరుద్యోగులు డిగ్రీ బిఎస్సి కెమిస్ట్రీ, డిప్లమో, ఐటిఐలలో ఉత్తీర్ణత సాధించిన వారు ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. నియమ నిబంధనల ప్రకారం 45 రోజులు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లో శిక్షణ ఇచ్చి అనంతరం ఉద్యోగాలలో నియమిస్తారన్నారు. ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15 వేల నుండి 20 వేల వరకు జీతం చెల్లిస్తారని పేర్కొన్నారు.

ఉపమాక జనసంద్రం

-భక్తులతో ఆలయం కిటకిట
-పలు సేవా కార్యక్రమాలు
-పోలీసులు పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి -నక్కపల్లి:ఉపమాక వేంకటేశ్వరస్వామి వార్షిక కళ్యాణోత్సవాల సందర్భంగా శుక్రవారం తెల్లవారు జాము నుంచి ఉపమాక భక్తజనసంద్రంగా మారింది. ఇతర జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు స్వర్ణలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 10 గంటల నుంచి భక్తుల రాక పెరగడంతో ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కిక్కిరిసిపోయింది. పలువురు భక్తులు బందరు వరస్సులో పుణ్యసాన్నాలు ఆచరించారు. ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు, కృష్ణ మాచార్యులు, శేషాచార్యుల నేతృత్వంలో పూజలు నిర్వహించారు. మహిళల కోలాట ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. ఆలయం వద్ద లడ్డూలు, ప్రసాదాలు విక్రయించకపోవడంతో భక్తులు తీవ్ర నిరాశ చెందారు. పెద్ద ఎత్తున పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సిఐ నారాయణరావు, ఎస్ఐ శిరీషలు పోలీసులకు సూచనలు, సలహాలను అందజేసారు.

సేవా కార్యక్రమాలు

హెటిరో డ్రగ్స్ ఉద్యోగుల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. శ్రీసత్య సాయి భజన మండలి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేసారు. తుని సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులకు పులహార పంపిణీ చేసారు.


భారీగా తరలి వచ్చిన భక్తులు

పట్టు వస్త్రాల సమర్పణ

కల్యాణోత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. హెటిరో డ్రగ్స్ కంపెనీ డైరక్టర్ మోహన్ రెడ్డి, కంపెనీ ప్రతినిధులు సత్యనారాయణరెడ్డి, కుల్లాయిరెడ్డి, మబ్బారెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. టిడిపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్యే వంగలపూడి అనిత, మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావు, రాష్ట్ర కాపు కార్పోరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్‌లు దర్శించుకున్నారు.

శ్మశాన వాటిక ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని లింగంపేట శివారు గవిరంపేట గ్రామంలో శ్మశానాన్ని కొంత మంది రైతులు ఆక్రమించారంటూ లింగంపేట టీడీపీ పార్టీ అధ్యక్షులు మారిశా వెంకటరమణ ఆధ్వర్యంలో తహశీల్దార్ ఆనందరావుకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ నెల 7న శ్మశానానికి సంబంధించి సర్వే నిర్వహించి సరిహద్దులు గుర్తిస్తామని తహశీల్దార్ తెలిపారని వెంకటరణమ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అనకాపల్లి పార్లమెంట్ పరిధి టిఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు గోలగొండ శ్రీకాంత్, గ్రామస్థులు మిడతాన సూరిబాబు, గాడి సత్తిబాబు, శ్రీరంరెడ్డి అర్జున తోకల కన్నబాబు కొర్రప్రోలు దొరబాబు పాల్గొన్నారు.


ఫిర్యాదు కాపీని చూపుతున్న నాయకులు

పశు సంచార వాహనానికి

డ్రైవర్ నియామకం

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-కోటవురట్ల:నిలిచిన సంచార పశు ఆరోగ్య సేవపై గురువారం ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి సంబంధిత అధికారుల నుండి స్పందన లభించింది. ప్రభుత్వం ఇటీవల పశు ఆరోగ్య సేవ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన పశు సంచార వాహనానికి డ్రైవర్ లేక గడిచిన వారం రోజులుగా నిలిచి పోవడంతో ప్రజాశక్తిలో వెలువడింది. ఈ మేరకు అధికారులు స్పందించి డ్రైవర్‌ను నియమించారు.దీంతో, పశు పోషకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


నియమించిన డ్రైవర్

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని చోద్యం-1 అంగన్వాడీ కేంద్రాన్ని ఎంపిడిఓ డేవిడ్‌రాజు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. కేంద్రంలో ఉన్న రికార్డులను ఆయన పరిశీలించారు. కేంద్రంలో గర్భిణీలు, బాలింతలలో రక్తహీనతను అధిగమించ డానికి తీసుకోవాల్సిన పౌష్టిక ఆహారంపై అంగన్వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఎల్.అరుణ, ఆయా పాల్గొన్నారు.


రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపిడిఓ

పశువులకు టీకాలు

ప్రజాశక్తి -కోటవురట్ల:గాలికుంటు వ్యాధి నివారణకు జాతీయ పశు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటవురట్ల, మాకవరపాలెం మండలాల పరిధిలో సుమారు 17,500 పశువులకు గాను 80శాతం టీకాలు వేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నాలుగు నెలలు దాటిన పశువులకు టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు ప్రతాప్ పాల్గొన్నారు.

చీడికాడ :మండలంలోని ఖండివరంలో పశు వైద్యాధికారులు సిహెచ్ గణేష్, జి.గాయత్రి దేవి ఆధ్వర్యంలో సుమారు 142 పశువులకు గాలి కుంటి వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ నెల 31వ తేదీ వరకు గ్రామాల్లో పశువులకు ఉచిత గాలి కుంటి వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతుందని, రైతు భరోసా కేంద్రంలో ఉండే గ్రామ పశు వైద్య సహాయకులను సంప్రదించాలని వారు సూచించారు.


టీకాలు వేస్తున్న పశు వైద్యులు


భోజనాన్ని రుచి చూస్తున్న అధికారులు

విద్యార్థులకు రుచికర భోజనం

ప్రజాశక్తి-కోటవురట్ల:విద్యార్థులకు పోషక విలువలతో కూడిన రుచికరమైన భోజనాన్ని అందజేయాలని మండల విద్యాశాఖ అధికారి పి.అప్పారావు, ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం మండలంలోని వెంకటాపురం జిల్లా పరిషత్ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను పరిశీలించడంతో పాటు విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందజేయాలని సూచించారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.


పరికరాలు ఇస్తున్న హెచ్ఎం జయలక్ష్మి, మహాలక్ష్మినాయుడు

ఘనంగా ప్రపంచ వినికిడి దినోత్సవం

ప్రజాశక్తి-రావికమతం:ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా మేడివాడ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలు ఎం.జయలక్ష్మి చేతుల మీదుగా విద్యార్థులకు శుక్రవారం వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ఎం జయలక్ష్మి, ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడులు మాట్లాడుతూ, ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా పాఠశాలలో రెండు రోజులుగా విద్యార్థులకు పాటలు, వ్యాసరచన, డ్రాయింగ్, తదితర ఆటల పోటీలను నిర్వహించామన్నారు. వినికిడి లోపాన్ని ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన చికిత్సను అందిస్తే నివారణ సులభతరం అవుతుందని తెలిపారు. దివ్యాంగ విద్యార్థిని విద్యార్థులకు ఎస్కార్ట్, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్, హోం బేస్డ్ అలవెన్స్, గర్ల్స్ స్టయిఫండ్ లను ప్రభుత్వం విడుదల చేసిందని, బ్యాంకు ఖాతాలలో జమ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పలనాయుడు, జయప్రభ, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


సమీక్ష నిర్వహిస్తున్న తహశీల్దార్ జానకమ్మ

భూముల రీ సర్వేపై సమీక్ష

ప్రజాశక్తి -కోటవురట్ల:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న భూముల రీ సర్వే పై తహశీల్దారు జానకమ్మ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటికే ఆరు గ్రామాల్లో రీ సర్వే పూర్తి కాగా మరో ఐదు గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేపై అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులకు అభ్యంతరాలపై నోటీసులు అందజేసి సర్వే నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. మండల వ్యాప్తంగా మరో 10 గ్రామాలకు డ్రోన్ సర్వే పూర్తయిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో స్పందన ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, రెవెన్యూ సమస్యలను పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ ప్రసాద్, పలు గ్రామాల రెవెన్యూ అధికారులు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న డిటిఒ సుభాషిణి

ఉప ఖజానా కార్యాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి -కోటవురట్ల: ఉపఖజానా కార్యాలయాన్ని జిల్లా ఖజానా అధికారి సుభాషిని శుక్రవారం సందర్శించారు ఈ సందర్భంగా పలువురు విశ్రాంత ఉద్యోగులు సమస్యలను ఆమెకు విన్నవించారు. అనంతరం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఎనిమిది ఉప ఖజాన కార్యాలయాలు ఉండగా కోటవురట్ల, అనకాపల్లి నియోజకవర్గంలో మరో ఖజానా కార్యాలయాలు అద్దెకు కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 8500 మంది విశ్రాంత ఉద్యోగులకు సేవలందిస్తున్నామన్నారు. కోటవురట్ల కార్యాలయంలో నాతవరం, మాకవరపాలెం మండలాల ఉద్యోగులకు అదే విధంగా ఆయా గ్రామ పంచాయతీలకు సేవలు అందు తున్నాయని సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ఆమె వెంట ఉప ఖజానా అధికారి నాయుడు పాల్గొన్నారు.

ఇన్వెస్టర్ల సందడి

విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో రెండు రోజులపాటు నిర్వహించనున్న 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023' శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, సిఎం జగన్, రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ, ప్రముఖ కంపెనీల ప్రతినిధులు, విదేశీ ప్రతినిధులు హాజరయ్యారు. పలువురు పారిశ్రామికవేత్తలు భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చారు. కళారూపాలు ఆకట్టుకున్నాయి. ఎపి పెవిలియన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



కేంద్ర మంత్రి గడ్కరీతో కలిసి సమ్మిట్‌కు వస్తున్న జగన్



నమూనాలను తిలకిస్తున్న కేంద్ర మంత్రి గడ్కరీ, సిఎం జగన్



సెల్ఫీ దిగుతున్న కంపెనీల ప్రతినిధులు



మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్



డ్యాన్స్‌లతో ఆకట్టుకున్న కళాకారులు

ప్రజా ఉద్యమాలకు అండగా ఉంటా

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ



అరిలోవలో ప్రచారం చేపడుతున్న రమాప్రభ

ప్రజా ఉద్యమాలకు అండగా ఉండి పోరాడడమే తన అభిమతమని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ హామీనిచ్చారు. విశాఖ, అనకాపల్లి జిల్లాలో పలు సంఘాల నేతలు ప్రచారం చేపట్టారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

అరిలోవ : ప్రజాఉద్యమాలకు అండగా ఉండి పోరాడడమే తన అభిమతమని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ హామీనిచ్చారు. శుక్రవారం ఉదయం ఆరు గంటలకే ఆరిలోవ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ వద్ద ప్రజాసంఘాల నాయకులతో కలిసి ముడసర్లోవ వాకర్స్ క్లబ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర సమస్యలపై తనకు సమగ్రమైన అవగాహన ఉందని, తాను గెలిస్తే వాటిపై మండలిలో ప్రస్తావించి, పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నీతి, నిజాయితీలకు కట్టుబడి, ప్రజాసమస్యలపై చిత్తశుద్ధితో పోరాడడం, ప్రజలకు అండగానిలవడం పిడిఎఫ స్వభావమని, దానికి శతశాతం కట్టుబడి తాను పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు ఆర్‌కెఎస్‌వి.కుమార్, శంకరరావు, నరేంద్ర కుమార్, కె.సత్యనారాయణ, వి.కృష్ణమూర్తి, రంగమ్మ, భూలోకరావు, ఆదినారాయణ, మోహనరావు, గణపతి పాల్గొన్నారు.

సిఐటియు నేతల విస్తృత ప్రచారం

తగరపువలస : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం తగరపువలసలోని పలు ప్రాంతాల్లో సిఐటియు నేతలు రవ్వ నరసింగరావు, ఎస్ శ్రీనివాసవర్మ, సోమి వెంకట్, ప్రజాశక్తి భీమిలి డివిజన్ కోఆర్డినేటర్ ఆర్ వెంకటరమణ కరపత్రాలను పంచుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

98వ వార్డులో విస్తృత ప్రచారం

సింహాచలం: ఈనెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ రమాప్రభను గెలిపించాలని కోరుతూ 98వ వార్డులోని పలు ప్రాంతాల్లో సిపిఎం, సిఐటియు, ఇతర ప్రజాసంఘాలతోపాటు ప్రజారైతు సంక్షేమ సంఘం సభ్యులు విస్తృతం ప్రచారం నిర్వహించారు.

కొత్తకోట: ఉద్యోగ, ప్రజా కార్మిక సంఘాలు బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని రావికమతం మండలంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం విస్తత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల కార్యదర్శి పాడి బెన్నయ్య, డోల కళ్యాణ్ కుమార్, సింగరపు వలసయ్యలు అర్జాపురం, బెన్నవరం, కొట్నాబిల్లి గ్రామాలలో ప్రచారం చేశారు.

పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభకు మద్దతు : బహుజన ఐక్యవేదిక కన్వీనర్ బొట్టా నాగరాజు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని కోరెడ్ల రమాప్రభకు తమ మద్దతు ఉంటుందని నర్సీపట్నం బహుజన ఐక్యవేదిక కన్వీనర్ బొట్టా నాగరాజు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పక్షాన ప్రశ్నించే పిడిఎఫ్ అభ్యర్థులను పార్టీలకు అతీతంగా ఎన్నుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నెల్లూరి చిరంజీవి, కొల్లు గంగాధర్, సంజీవ్ పాల్గొన్నారు.

చోడవరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం గోవాడ ఫ్యాక్టరీ, చోడవరం చందక వీధి, వెలమ వీధి ప్రాంతాలో ప్రచారం నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు వివి శ్రీనివాసరావు, ఎస్వి నాయుడు, కోవెల శ్రీను, వై గణేష్, చందర్రావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : కోరెడ్ల రమాప్రభకు తొలి ప్రాధాన్యత ఓట్లు వేయాలని అచ్యుతాపురం మండల కేంద్రంలో శుక్రవారం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, మండల కార్యదర్శి కే సోమినాయుడు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఓటర్లను కలిశారు.

బుచ్చయ్యపేట : ప్రజా సంఘాల ఉమ్మడి అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మద్దతు ఇవ్వాలని కోరుతూ సిఐటియు మండల కార్యదర్శి పి. సాంబశివరావు ప్రచారం నిర్వహించారు. శుక్రవారం మండలంలోని రాజాం, నీలకంఠాపురం, తైపురం, చిట్టి పాలెం, తురకలపూడి, సీతయ్యపేట ప్రచారం చేశారు.

మునగపాక రూరల్ : కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ మునగపాకలో గురువారం రాత్రి సిఐటియు నాయకులు ఎస్ బ్రహ్మాజీ, ప్రజా సంఘాల నాయకులు ప్రచారం చేపట్టారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే రమాప్రభను 250 ప్రజా సంఘాలు బలపరుస్తున్నాయని తెలిపారు. కౌలు రైతు సంఘం నాయకులు టెక్కలి జగ్గారావు, పెంటకోట సత్యనారాయణ, నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌లో నీటి సమస్యపై నివేదిక

- ఎంఇఒ సాయి శైలజ - ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : స్థానిక గర్ల్స్ హై స్కూల్‌లో నీరు లేక విద్యార్థినుల అవస్థలు పేరిట ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి ఎంఈఓ సాయి శైలజ స్పందించారు. ఈ విషయంపై ప్రధానోపాధ్యాయులు నుండి రాత పూర్వక వివరణ తీసుకొని డీఈఓకు పూర్తి స్థాయిలో నివేదిక పంపించామని సాయి శైలజ తెలిపారు. ఈ ఘటన జరిగి నప్పుడు తాను వేరొక మండలంలో విజిట్‌లో ఉన్నానని, విషయం తెలిసిన వెంటనే హైస్కూల్‌ను సందర్శించానన్నారు. బాలికలు భోజన సమయంలో ఇబ్బంది పడిన విషయం వాస్తవమేనన్నారు. భోజనం పెట్టే సమయంలో వాటర్ టాంక్ లో నీళ్ళు లేకపోవడం, అదే సమయంలో కరెంట్ లేకపోవడంతో ఈ సమస్య తలెత్తిందన్నారు. నీరు లేదఅనే విషయాన్ని ప్రధానో పాధ్యాయురాలు తనకు ముందుగా తెలియజేసి నట్లయితే మునిసిపల్ అధికారులతో మాట్లాడి వాటర్ ఏర్పాటు చేసి ఉండేవారమన్నారు.

తెగుళ్ల నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి- చీడికాడ: మండల కేంద్రంలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వేరుశనగ సాగుపై మండల వ్యవసాయ అధికారి ఈఆర్‌ఏ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేరుశనగ పంటలో తామర పురుగులు ఆకుల అడుగు భాగంలో రసం పీల్చడంతో ఆకులు వంకర్లు తిరిగాయని నివారణకు గాను మోనోక్రోటోపాస్ 1.6 మిల్లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. వేరుశనగ పంట పూత దశకు ముందు జిప్సం ఎకరానికి రెండు వందల కేజీలు వేయడంతో అధిక దిగుబడి, నూనె శాతం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం.గణేష్, ఏపీ సీఎం ఎఫ్ సిబ్బంది కామిరెడ్డి వెంకట్రావు, గౌరీ నాయుడు, రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి శ్రీనివాస్